సాక్షి
నల్లగొండ
శుక్రవారం : 29 : సెప్టెంబర్ : 2023



కమ్యూనిస్టులతోనే న్యాయం
కమ్యూనిస్టుల నాయకత్వంలోనే పేదోడికి న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. - 8లో



టెట్‌లో 9,149 మంది అర్హత
టెట్‌కు ఉమ్మడి జిల్లాలో 36,926 మంది హాజరు కాగా 9,149మంది అభ్యర్థులు అర్హత సాధించారు. - 8లో



ఐక్యతామూర్తి లక్ష్మణ్ బాపూజీ
ఐక్యతామూర్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు విమలక్క అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఎక్కువ సీట్లు ఇచ్చే పార్టీలకే గౌడ్‌ల మద్దతు



మాట్లాడుతున్న కాశయ్యగౌడ్

నల్లగొండ టూటౌన్‌: రానున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో గౌడ్ సామాజిక వర్గానికి ఎక్కువ సీట్లు కేటాయించే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి కాశయ్యగౌడ్ తెలిపారు. గురువారం నల్లగొండలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ సామాజిక వర్గానికి 16 ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 29న జరుగుతున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో గౌడ్‌ల సమస్యలపై సీఎం కేసీఆర్ చర్చించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రేగట్టే సైదులుగౌడ్, జె.శంకర్‌గౌడ్, ఎం.దశరథగౌడ్, బూర జానయ్యగౌడ్, రాజాగౌడ్, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్ సస్పెన్షన్ రద్దు

నల్లగొండ టూటౌన్‌: జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్రావణ్‌కుమార్ సస్పెన్షన్ రద్దు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పాల్వాయి శ్రావణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోపణలు ఉన్న అన్నిరకాల రికార్డులను అందజేసినందున, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ మౌఖిక ఆదేశాల మేరకు శ్రావణ్‌కుమార్‌పై సస్పెన్షన్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లాకు మూడు పీహెచ్‌సీలు మంజూరు

చండూరు(గట్టుప్పల్): జిల్లాకు మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. నూతనంగా ఏర్పడిన తిరుమలగిరి సాగర్, నేరేడుగొమ్ము, గట్టుప్పల్ మండలాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఆయా మండలాల్లో ఒక్కో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.1.43 కోట్ల నిధులను విడుదల చేసింది.

యాదాద్రిలో జోడు సేవోత్సవం



జోడు సేవలను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం నిత్యపూజలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీసుదర్శన హోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

మున్సిపల్ కమిషనర్‌తో రేపు ఫోన్ ఇన్



పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్ మిర్యాలగూడ

మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పారిశుద్ధ్యం లోపించింది. పట్టణంలోని దోమల బెడద ఎక్కువ కావడంతో వివిధ కాలనీల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలో పలుచోట్ల ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి ఇబ్బందిగా మారుతుంది. పారిశుద్ధ్యం, డ్రైయినేజీ, మంచినీరు, వీధిలైట్లు తదితర సమస్యలను ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేదీ : 30-09-2023 (శనివారం)
ఉదయం 9 నుంచి 10 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
98499 05914

అండగా 'ఆరోగ్య మహిళ'

29 వారాలుగా 16,649 మంది మహిళలకు పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాల్లో ప్రతి మంగళవారం ప్రత్యేక వైద్యం
- ఎనిమిది రకాల వ్యాధులకు టెస్టులు, మందులు ఉచితం
- వైద్యం కోసం తరలి వస్తున్న వనితలు



ఇప్పటి వరకు చేసిన పరీక్షలు

రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ	12,852
గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్..	1,694
నోటి క్యాన్సర్ నిర్ధారణకు..	12,590
మూత్రనాళ ఇన్‌ఫెక్షన్..	1,687
మామోగ్రామ్ పరీక్షలు	415
జీజీహెచ్‌కు రెఫర్ చేసిన కేసులు	1,695
వైద్యసేవలు పొందిన మహిళలు	1,388



శాలిగౌరారం పీహెచ్‌సీలో మహిళలకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

నల్లగొండ టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. మహిళలకు వచ్చే జబ్బులను ఆదిలోనే గుర్తించడం ద్వారా వారి ఆరోగ్యానికి భరోసాను కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కేంద్రాలు మహిళలకు అండగా నిలుస్తున్నాయి. ప్రపంచ మహిళా దినోత్సవం రోజున ఈ ఏడాది మార్చి 8న ఆరోగ్య మహిళ కేంద్రాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ కేంద్రాల్లో కేవలం మహిళా వైద్యుల చేత మహిళలకు వైద్యసేవలను అందిస్తున్నారు. జిల్లాలో మొత్తం 11 ఆరోగ్య మహిళ కేంద్రాల్లో ఇప్పటి వరకు 29 వారాల్లో 16,649 మంది మహిళలకు ప్రత్యేక వైద్యం అందించారు.

ఎంపిక చేసిన పీహెచ్‌సీల్లో సేవలు

ముఖ్యంగా క్యాన్సర్, రక్తహీనత, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, కుటుంబ నియంత్రణ, మోనోపాజ్ నిర్వహణ, రుతుస్రావం ఊబకాయం, బీపీ, షుగర్ తదితర పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వారికి అవసరమైన పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఏమైన వ్యాధులు ఉన్నట్లు అనుమానం ఉంటే వెంటనే వారిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేసి అక్కడ తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఉచితంగా ఖరీదైన పరీక్షలను చేయించి అక్కడ స్పెషలిస్టు వైద్యుల చేత వైద్యం అందించే ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

ముందుగానే వ్యాధులు గుర్తించి..

మహిళలు సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోని కారణంగా అనేక మంది మహిళలు క్యాన్సర్, రక్తహీనత, లైంగిక తదితర వ్యాధులు ముదిరి ప్రాణాలను కోల్పోతున్నారు. దీనిని అధిగమించేందుకు ముందుగానే ఆరోగ్య మహిళ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధులను గుర్తించి వైద్యం అందించి వారి ప్రాణాలను కాపాడుతోంది. దీంతో ఆరోగ్య మహిళ కేంద్రాలకు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి వైద్యసేవలను పొందుతున్నారు.

తొలుత ఆరు కేంద్రాల్లోనే..

రాష్ట్ర ప్రభుత్వం తొలుత నియోజకవర్గానికి ఒక ఆరోగ్య మహిళ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో మాన్యంచెల్క, డిండి, నిడమనూరు, వేములపల్లి, కట్టంగూర్, మర్రిగూడ పీహెచ్‌సీలలో ఆరోగ్య మహిళ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం నూతనంగా తిప్పర్తి, చండూరు, చింతపల్లి, శాలిగౌరారం, దామరచర్ల పీహెచ్‌సీలనూ ఆరోగ్య మహిళ కేంద్రాలుగా మార్చి మహిళలకు ప్రత్యేక వైద్యసేవలను అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యమహిళా కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచితంగా ఖరీదైన పరీక్షలను చేయడంతో పాటుగా మందులను కూడా అందిస్తుంది. ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వివిధ క్యాన్సర్ కారక వ్యాధుల అనుమానం ఉన్న మహిళలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

మంత్రుల పర్యటనకు సిద్ధం



నకిరేకల్ : మినీ స్టేడియంలో సిద్ధమవుతున్న సభావేదిక

- నేడు ఉమ్మడి జిల్లాకు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ రాక
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో కలిసి పాల్గొననున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటించనున్నారు. యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందులో భాగంగా నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు హాజరుకానున్నారు. దేవరకొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో సత్యవతి రాథోడ్ పాల్గొననున్నారు. అక్టోబర్ 5వ తేదీ తర్వాత ఏ సమయంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో అభివృద్ధి, సంక్షేమ పనులను వేగవంతం చేయాలని ఇదివరకే బీఆర్‌ఎస్ అధిష్టానం ఎమ్మెల్యేలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంత్రులతో ఆయా పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేలా ఎమ్మెల్యేలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్ జిల్లాకు వస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. నకిరేకల్, తుంగతుర్తి బహిరంగ సభల్లో మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి ప్రసంగించనున్నారు. అలాగే ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అక్టోబర్ 2న సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.

హరీశ్‌రావు పర్యటన షెడ్యూల్ ఇలా..

- యాదాద్రి జిల్లా (నకిరేకల్ నియోజకవర్గం) రామన్నపేటలో మధ్యాహ్నం 12 గంటలకు సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.
- 12:15కు రామన్నపేటలో 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 12:30కు రామన్నపేటలో శ్రీ చెన్నకేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం చెరువుఅన్నారం గ్రామ సమీపంలో అయిటిపాముల ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 1:15కు నకిరేకల్‌లో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.
- 1:45 గంటలకు నకిరేకల్‌లో డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 2 గంటలకు నకిరేకల్ మినీ స్టేడియంలో పబ్లిక్ మీటింగ్‌లో ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం 3 గంటలకు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని జాజిరెడ్డిగూడెంలో ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభిస్తారు.
- 3:15 గంటలకు జాజిరెడ్డిగూడెం సబ్‌మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విద్యాసాగర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.
- 3:30 గంటలకు అర్వపల్లిలోని యోగానందస్వామి దేవాలయాన్ని సందర్శిస్తారు.
- 4 గంటలకు తుంగతుర్తిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 4.30 గంటలకు తుంగతుర్తిలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.
- 4:45 గంటలకు తుంగతుర్తి సంతలో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- 5:45 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.

మంత్రుల పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నకిరేకల్/కట్టంగూర్: నియోజకవర్గంలో శుక్రవారం రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గుండకండ్ల జగదీష్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో నకిరేకల్‌లోని మినీ స్టేడియంలోని సభా ఏర్పాట్లను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పరిశీలించారు. అలాగే కట్టంగూర్ మండలం అయిటిపాముల ఎత్తిపోతల పథకం శంకుస్థాపన ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్‌లు జె.శ్రీనివాస్, హేమంత్ కేశవ్ పాటిల్, ఆర్డీఓ చెన్నయ్యతో కలిసి వేర్వేరుగా పర్యవేక్షించారు. వారివెంట కట్టంగూర్ తహసీల్దార్ స్వప్న, ఆర్‌ఐ కుమార్‌రెడ్డి ఉన్నారు.



నకిరేకల్ : సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, అధికారులు

సత్యవతి రాథోడ్ పర్యటన షెడ్యూల్

- ఉదయం 8 గంటలకు కొండమల్లేపల్లి చేరుకుంటారు.
- 8:30కు కేశ్యతండాలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 8:45కు పన్నితండాలో (గుర్రపు తండా) బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 9 గంటలకు కొండమల్లేపల్లిలో నిర్మించిన తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల భవనం ప్రారంభిస్తారు. అక్కడే అదనపు గదులు, డార్మెటరీ బ్లాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 9:30కు కొమ్మేపల్లిలో నిర్మించిన తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల భవనం ప్రారంభిస్తారు. అక్కడే అదనపు గదులు, డార్మెటరీ బ్లాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 10 గంటలకు దేవరకొండ మండలం పెంచికలపహాడ్‌లో వైటీసీ భవనాన్ని ప్రారంభిస్తారు.
- 10:30కు దేవరకొండలోని సాయిబాబా దేవాలయం దగ్గర బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 11 గంటలకు దేవరకొండలో గిరిజన భవనం ప్రారంభిస్తారు.
- 11:30కు దేవరకొండ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు మిర్యాలగూడ చేరుకుంటారు.
- 2 గంటలకు దామరచర్ల మండలం గాంధీనగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 3 గంటలకు దామరచర్లలో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు శంకుస్థాపన చేస్తారు.
- సాయంత్రం 4 గంటలకు అడవిదేవులపల్లి మండలంలోని వుస్లాయిపాలెం నుంచి మొల్కచర్ల, వుస్లాయిపాలెం నుంచి తాటిచెట్టుతండా, వుస్లాయిపాలెం నుంచి బంగారిగడ్డతండా వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే వేముల



ఢిల్లీలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశానికి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మల్లికార్జున ఖర్గే

- ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో చేరిక
- ఉత్కంఠకు తెర

నకిరేకల్ : నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వాస్తవానికి ఈనెల 23న ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు ఢిల్లీకి వెళ్లారు. కానీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో తిరిగి వచ్చారు. గురువారం ఉదయం ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మళ్లీ ఢిల్లీకి వెళ్లి మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా వేముల వీరేశం విద్యార్థి దశ నుంచి విప్లవోద్యమంలో పనిచేసి జనశక్తిలో రాష్ట్ర నేతగా ఎదిగారు. అప్పట్లో ప్రభుత్వంతో జరిపిన చర్చల అనంతరం జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఆ తర్వాత ఆయన నకిరేకల్‌లో నివాసం ఉంటూ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆశీస్సులతో 2009లో బీఆర్‌ఎస్‌లో చేరారు. 2013లో బీఆర్‌ఎస్ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు.

2014లో ఎమ్మెల్యేగా గెలుపు

బీఆర్‌ఎస్ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన వేముల వీరేశం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ తనకుంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అధిష్టానం నకిరేకల్ టికెట్‌ను వీరేశానికి కేటాయించింది. ఆ ఎన్నికల్లో వీరేశం కాంగ్రెస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యపై విజయం సాధించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. తదనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో చిరుమర్తి లింగయ్య బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఇరువురూ ఒకే పార్టీలో ఉంటూనే వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ సారి బీఆర్‌ఎస్ టికెట్ తనకే వస్తుందన్న ధీమాతో వీరేశం చివరి వరకు ఎదురుచూశారు. కానీ, ముఖ్యమంత్రి కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నకిరేకల్ అసెంబ్లీ టికెట్ కేటాయించడంతో వేముల వీరేశం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.

ఎస్‌జీటీలకు పదోన్నతి అవకాశం

- పండిట్‌లు, పీడీ పోస్టుల్లో ఎస్‌ఏలుగా నియమించాలన్న హైకోర్టు
- అర్హతను బట్టి లభించనున్న ఉద్యోగోన్నతి
- టెట్ నిబంధనతో అన్యాయం జరగనుందని సీనియర్ టీచర్ల ఆవేదన

నల్లగొండ: భాషా పండిట్‌లు, ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టుల్లో ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో పండిట్‌లు, పీడీలకే కాకుండా సీనియారిటీ, అర్హతను బట్టి ఎస్‌జీటీలకు కూడా స్కూల్ అసిస్టెంట్లు(ఎస్‌ఏలు)గా పదోన్నతి పొందే అవకాశం కల్పించారు. గతంలో తెలుగు, హిందీ పండిట్‌లు, పీడీ కోర్సులు చేసిన వారికి మాత్రమే భాషా పండిట్‌లు, పీడీ పోస్టుల్లో



స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ వచ్చారు. దీంతో తమకు కూడా కల్పించాలని ఎస్‌జీటీలు ఇటీవల హైకోర్టుకు వెళ్లారు. దీంతో హైకోర్టు రెండు రోజుల క్రితం అర్హత ఉన్న ఎస్‌జీటీలకు కూడా భాషా పండిట్‌లు, పీడీ పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లుగా అవకాశం ఇవ్వాలని ఆదేశించింది. దీంతో ఎస్‌జీటీలకు అర్హత మేరకు పదోన్నతి లభించనుంది.

టెట్ నిబంధనతో ఆందోళన!

స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందేవారికి టెట్ తప్పనిసరి అని విద్యాశాఖ చెబుతోంది. దీంతో సీనియర్లకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. 2010 కంటే ముందు ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి టెట్ పరీక్ష లేదు. దీంతో వారికి సీనియారిటీ ఉన్నా టెట్ నిబంధనతో పదోన్నతి పొందే అవకాశం ఉండదని ఆందోళన చెందుతున్నారు. టెట్ నిబంధన లేకుండా సవరించాలని అర్హత ఉన్న ఎస్‌జీటీలు డిమాండ్ చేస్తున్నారు.

వార్డులను పరిశుభ్రంగా ఉంచండి

- తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- దోమల నివారణకు విధిగా ఫాగింగ్ చేపట్టేలా సిబ్బందిని ఆదేశించాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో దేవరకొండ మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు విన్నవించిన ప్రజలు
- ప్రాధాన్యతా క్రమంలో అన్ని సమస్యలూ పరిష్కరిస్తాం : కమిషనర్ వెంకటయ్య

దేవరకొండ: దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలి. వివిధ కాలనీల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరారు. అలాగే దోమలు, కోతులు, కుక్కల బెడదను నివారించాలని, అంతర్గత సీసీ రోడ్ల మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. గురువారం సాక్షి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన ప్రజలు నేరుగా మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపారు. ప్రజలు విన్నవించిన సమస్యలకు కమిషనర్ సావదానంగా సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం, పాలకవర్గం ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తోందని తెలిపారు.

ప్రశ్న : మిషన్ భగీరథ నీళ్లు నాలుగు రోజులకు ఒకసారి వస్తున్నాయి. రోజూ తాగునీరు అందిస్తే బాగుంటుంది. అంతే కాకుండా కాలనీలో యూజీడీ పనులు చేపట్టాలి.

– అంకం చంద్రమౌళి, 11వ వార్డు

కమిషనర్ : మిషన్ భగీరథ నీటి సరఫరాలో సాంకేతిక సమస్య తలెత్తడంతో కొంతమేర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మోటార్ల మరమ్మతులు పూర్తికాగానే నీటి సరఫరాలో ఇబ్బందులు తొలగిపోతాయి. వార్డులో 2వ విడతలో యూజీడీ పనులు చేపట్టే అవకాశం ఉంది.

ప్రశ్న : మా ఇంటి ముందు డ్రెయినేజీ మ్యాన్‌హోల్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పలుమార్లు సమస్యను విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది.

– రఘురామయ్య, 10వార్డు

కమిషనర్ : సమస్య మా దృష్టికి వచ్చింది. పలుమార్లు అక్కడ మరమ్మతు పనులు చేపట్టినా ప్రయోజనం లేదు. కొత్తలైన్ వేసి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : చెత్త సేకరణ ఆటోలు రోజూ రావడం లేదు. కాలనీ పరిసరాలను శుభ్రం చేయించాలి.

–శ్రీనాథ్, 17వ వార్డు



ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటయ్య

కమిషనర్ : వార్డుల వారీగా చెత్త సేకరణకు ఆటోలు కేటాయించి ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నాం. ఆటో డ్రైవర్లకు విధిగా సూచనలిస్తున్నాం. మున్సిపల్ సిబ్బందిని పంపించి పరిసరాలను శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న : కాలనీలో పలుచోట్ల శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఉన్నాయి. పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో పాముల బెడద ఎక్కువైంది.

– జల్దా భాస్కర్, 15వ వార్డు

కమిషనర్ : శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి ఇప్పటికే యజమానులకు నోటీసులు జారీచేశాం. వాటిని తొలగించే చర్యలు చేపట్టనున్నాం. జేసీబీతో చెట్లను తొలగించి సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న : కాలనీల్లో కోతులు, కుక్కల బెడద అధికంగా ఉంది. కోతుల దాడిలో చిన్నారులు గాయాలపాలవుతున్నారు. రోడ్లపై విచ్చలవిడిగా చెత్త పడేస్తున్నారు.

– ఎస్‌వీటీ, బీఎస్‌ఆర్ కాలనీ

కమిషనర్ : కోతులను పట్టేవారిని నెల్లూరు నుంచి పిలిపించి వాటిని పట్టి అడవిలో వదిలే విధంగా చర్యలు తీసుకుంటాం. చెత్త సేకరణకు ఇంటింటికీ తడిచెత్త, పొడిచెత్త డబ్బాలు పంపిణీ చేశాం. కానీ కొన్నిచోట్ల రోడ్లపై చెత్త వేస్తున్నారు. పట్టణ ప్రజలు చెత్త సేకరణకు వచ్చే ఆటోల్లో మాత్రమే చెత్తను పడేయాలి.

ప్రశ్న : దేవరకొండ పట్టణంలోని పలు కాలనీల్లో యూజీడీ, మిషన్ భగీరథ పనుల వల్ల అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్య పరిష్కరించండి.

– వెంకటేష్, గణేశ్‌నగర్

కమిషనర్ : అంతర్గత రోడ్ల మరమ్మతులకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : చెత్త సేకరించే బండ్లు మెయిన్ రోడ్డు వరకే వస్తున్నాయి. ప్రతిరోజూ కాలనీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– అల్తాఫ్, మగ్దూం నగర్

కమిషనర్ : చెత్త సేకరణకు సంబంధించి ఆటోలు ప్రతి కాలనీకి పంపుతున్నాం. అలా కాకుండా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సమస్యను పరిష్కరిస్తాం. రోజు వారీగా వాహనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య నివారణకు సహకరించాలి.

ప్రశ్న : అఫ్జల్ ఇంటి నుంచి పైకి వెళ్లేదారి రాళ్లు, మట్టితో నిండిపోయింది. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే పరిస్థితి లేదు. సమస్య పరిష్కరించాలి.

–గెల్వయ్య, అంజయ్య కాలనీ

కమిషనర్ : తక్షణమే పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. దారిలో ఉన్న మట్టి, రాళ్లను తొలగించి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతాం.

ప్రశ్న : మా వార్డులో దోమలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీలో కోతులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడు చేస్తున్నాయి. చాలా భయంగా తిరగాల్సి వస్తోంది. వెంటనే వాటిని నివారించాలి.

– బత్తుల అమర్, 11వ వార్డు

కమిషనర్ : దోమల నివారణకు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే ఫాగింగ్ చేపట్టాం. ఆయిల్ బాల్స్‌ను తయారు చేసి మురుగునీరు నిల్వ ఉండే చోట వేస్తున్నాం. కాలనీల్లో కోతుల బెడద నివారణకు త్వరలోనే చర్యలు తీసుకోనున్నాం.

క్లుప్తంగా

వివాహిత బలవన్మరణం

డిండి: భయాందోళనతో ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం డిండి మండల పరిధిలోని కందుకూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన మాదాసు వెంకటయ్య కుమార్తె లక్ష్మీదేవి(21)కి గతేడాది మే నెలలో డిండి మండలంలోని కుందుకూర్ గ్రామానికి చెందిన కుంభం సాయితో వివాహం జరిగింది. సాయి స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భయాందోళనకు గురైన లక్ష్మీదేవి ఇంట్లో వాళ్లకు ఫోన్ చేసింది. వారు ఇంటికి వచ్చే లోపు ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సాయి ఇంటికి రాగానే బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని లక్ష్మీదేవి కన్పించింది. వెంటనే ఆమెను కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెందింది. మృతురాలి తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్. సైదులు తెలిపారు. మృతురాలికి నాలుగు నెలల పాప ఉంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన దామరచర్ల మండల పరిధిలోని కొండ్రపోల్ గ్రామం వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై గురువారం చోటు చేసుకుంది. దామరచర్ల ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండ్రపోల్ గ్రామానికి చెందిన ముదిగొండ సైదులు(60) రాళ్లవాగుతండా వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం సైదులును ఢీకొట్టింది. దీంతో సైదులు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

- ఆత్మకూర్–ఎస్ మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఘటన
- స్కూల్ ఎదుట విద్యార్థి సంఘాలు, మృతుడి బంధువుల ఆందోళన



రాకేష్ (ఫైల్)

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట): ఆత్మకూర్–ఎస్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, విద్యార్థులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ఆలకుంట్ల వెంకన్న, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. వీరు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు రాకేష్ (16) ఆత్మకూర్–ఎస్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా బుధవారం రాత్రి వరకు హాస్టల్‌లో తోటి విద్యార్థులతో కలిసి ఉన్న రాకేష్ ఆ తర్వాత పాఠశాలలోని పాత మరుగుదొడ్ల పక్కన ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున ఇతర విద్యార్థులు చూసి ఉపాధ్యాయులకు విషయం తెలపగా.. పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, సూర్యాపేట, తుంగతుర్తి సీఐలు అశోక్‌రెడ్డి, బ్రహ్మమురారి పరిశీలించారు. రాకేష్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. తమ కుమారుడు తమను చూడాలని ఉందని, పాఠశాల వద్దకు రమ్మనగా.. దసరా పండుగకు వస్తామని చెప్పామని, దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి జయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కట్టా వెంకటరెడ్డి తెలిపారు.



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, మృతుడి బంధువులు

విద్యార్థి సంఘాల ఆందోళన..

రాకేష్ ఆత్మహత్య విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎంఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులతో పాటు మృతుడి బంధువులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళనకు చేపట్టారు. ఉపాధ్యాయులు వేధింపులతోనే రాకేష్ ఆత్మహత్య చేసుకున్నాడని.. ప్రిన్సిపాల్‌తో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులపై కేసు నమోదు చేయడంతో పాటు వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. దీంతో కొద్దిసేపు పాఠశాలలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అనంతరం గురుకుల పాఠశాల ఆర్‌సీఓ షర్మిల అక్కడకు రావడంతో మృతుడి కుటుంబ సభ్యులు ఆమె కారుకు అడ్డుగా కూర్చొని ఆందోళనకు దిగారు. గురుకుల పాఠశాలల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపించారు. అనంతరం పోలీసులు, తహసీల్దార్ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

1న ఉమ్మడి నల్లగొండ జిల్లా యోగాసన పోటీలు

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ గుర్తింపు పొందిన ఉమ్మడి జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1వ తేదీన నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుంభం నర్సిరెడ్డి, నంద్యాల రాజశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను సబ్ జూనియర్ విభాగంలో 8 నుంచి 10 ఏళ్లు, 10 నుంచి 12 ఏళ్లు, 12 నుంచి 14 ఏళ్లు, జూనియర్స్ విభాగంలో 14 నుంచి 16 ఏళ్లు, 16 నుంచి 18 ఏళ్ల వయస్సున్న బాలబాలికలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సీనియర్స్ విభాగంలో 18 నుంచి 21 ఏళ్లు, 21 నుంచి 25 ఏళ్లు, 25 నుంచి 30 ఏళ్లు, 30 నుంచి 35 ఏళ్లు, 35 నుంచి 45 ఏళ్లు, 45 నుంచి ఆ పైబడిన స్త్రీ, పురుషులకు పోటీలు ఉంటాయని వివరించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని త్వరలోనే జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వయసు ధ్రువీకరణ పత్రాలతో అక్టోబర్ 1వ తేదీన ఉదయం 10గంటలకు ఇండోర్ స్టేడియం వద్దకు రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440072854, 9885140616 నంబర్లను సంప్రదించాలన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

త్రిపురారం: రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో పాటు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ పరిశోధన స్థానం కంపాసాగర్ హెడ్ డా. లింగయ్య అన్నారు. గురువారం త్రిపురారం మండలంలోని జి.అన్నారం గ్రామంలో డ్రోన్ సహాయంతో వరి పొలాల్లో పురుగు మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. లింగయ్య మాట్లాడుతూ.. పంటల సాగులో యాంత్రీకరణ విధానం వల్ల కూలీల కొరతను అధిగమించడంతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకొని అధిక లాభాలు సాధించవచ్చన్నారు. వరి పంటలో చీడపీడలను సకాలంలో గుర్తించి తక్షణమే సస్యరక్షణ చేపట్టాలన్నారు. అవసరమైతే శాస్త్రవేత్తల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జి.అన్నారం సర్పంచ్ సుభాష్‌రెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న డా. లింగయ్య

కట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

మిర్యాలగూడ: అదనపు కట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం దామరచర్ల మండలంలోని గణేష్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. వాడపల్లి ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కేశనేనిపల్లి గ్రామానికి చెందిన జ్యోతి(22)కి దామరచర్ల మండంలోని గణేష్‌పహాడ్‌కు చెందిన బానావత్ రమేష్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని, పిల్లలు పుట్టడం లేదంటూ జ్యోతిని కొద్దిరోజులుగా భర్త రమేష్, మామ జగన్, అత్త మక్తి, మరిది సైదా, మరదలు అఖిల మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు. రమేష్‌కు వేరే పెళ్లి చేస్తామని చెప్పి బెదిరిస్తుండడంతో మనస్తాపానికి గురైన జ్యోతి బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మిర్యాలగూడకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. జ్యోతి మృతికి కారణమైన భర్త, అత్తమామలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతురాలి బంధువులు గణేష్‌పహాడ్ ఆందోళన నిర్వహించారు. పోలీసుల జోక్యం చేసుకొని తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి జ్యోతి అంత్యక్రియలు నిర్వహించారు. జ్యోతి తండ్రి నరియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తెలంగాణ ఐక్యతామూర్తి కొండా లక్ష్మణ్ బాపూజీ

- అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు విమలక్క



మాట్లాడుతున్న విమలక్క

భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్: తెలంగాణ ఐక్యతామూర్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు విమలక్క అన్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో చౌటుప్పల్‌కు చెందిన చిరందాస్ ధనుంజయ్య నిర్మాణ సారథ్యంలో భూదాన్‌పోచంపల్లికి చెందిన యువ దర్శకుడు బడుగు విజయ్‌కుమార్ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన యూనిటీ(ద మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్) డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు బాపూజీ తన జీవితాన్ని త్యాగం చేశారని, ఆ మహనీయుడిపై చిత్రాన్ని నిర్మించిన దర్శక, నిర్మాతలను అభినందించారు. సినీ నటి పూనం కౌర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ.. యూనిటీ డాక్యుమెంటరీ చిత్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, జాతీయ చేనేత దినోత్సవ రూపకర్త యర్రమాద వెంకన్న, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యనారాయణ, నటుడు రోషన్ బాలు, చిత్ర నిర్మాత చిరందాస్ ధనుంజయ్య, మచ్చ సుధాకర్, రాపోలు జ్ఞానేశ్వర్, గోశిక యాదగిరి, శ్రీధర్, గురునాథం, గద్దం వెంకటేశం, రాంనర్సయ్య, ప్రముఖ కార్టూనిస్ట్‌లు కూరెళ్ల శ్రీనివాస్, చిల్వేరు మృత్యుంజయ్య, నటీనటులు మైం మధు, మాస్టర్ భాను, కెమెరామెన్ మహేశ్, ఆర్‌సీఎం రాజు, ఎడిటర్స్ రాజు, సతీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన సినీ నటి పూనమ్ కౌర్, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ తదితరులు





బెల్టు షాపులపై పోలీసుల దాడులు

- ఎనిమిది మంది అరెస్ట్

భువనగిరి క్రైం: గణేష్ నిమజ్జనం నేపథ్యంలో బెల్ట్ షాపులపై ఎస్‌ఓటీ, భువనగిరి రూరల్ పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు గురువారం భువనగిరి రూరల్ ఎస్‌ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపారు. భువనగిరి మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన ఏట్టపు కొండలు, బస్వాపురం గ్రామానికి చెందిన ఉడుత సాయి, మచ్చ భాస్కర్, గౌస్‌నగర్ గ్రామానికి చెందిన గోదా వెంకటేశ్వర్, హనుమపురం గ్రామానికి చెందిన రంగా అక్షయ వద్ద వివిధ బ్రాండ్ల మద్యం, బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోత్కూరులో..

మోత్కూర్: పట్టణంలో 3 బెల్టు షాపులపై గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన రూ.40వేల విలువైన మద్యంను సీజ్ చేశారు. బెల్టు షాపులు నిర్వహిస్తున్న కట్టెకోల కనకయ్య, ముక్కెర శ్రీనివాస్, బుర్ర సత్యనారాయణ మీద కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దళితబంధు అర్హులకు రాలేదంటూ ఆందోళన



కప్రాయపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని కప్రాయపల్లి గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు గురువారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి వస్తున్నట్లు తెలుసుకున్న దళితులు గ్రామంలో దళితబంధు పథకం అర్హులకు రాలేదంటూ ఆందోళన చేపట్టారు. దీతో ఆత్మకూరు(ఎం), మోత్కూరు పోలీసులు ముందస్తుగా కొంగరి రాజు, కొంగరికుమార్, కొంగరి శంకర్, కొంగరి రవి, కొంగరి నితిన్‌ను అదుపులోకి తీసుకుని ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీపీ తండ మంగమ్మ, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, ఎంపీటీసీ మర్యాల వెంకటేశం పోలీసులతో మాట్లాడడంతో ప్రభుత్వ విప్ పర్యటన అనంతరం వారిని విడిచిపెట్టారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. యువకుడు దుర్మరణం

మోతె: బైక్‌కు వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మోతె మండలం మామిళ్లగూడెం గ్రామంలోని మసీదు వద్ద జాతీయ రహదారి(365బీబీ)పై గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని రిక్కా బజారుకు చెందిన మురళి(35) వృత్తిరీత్యా సుతారి మేస్త్రిగా పనిచేస్తున్నాడు. గురువారం అతడు సూర్యాపేటలో తన బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు హాజరై తిరిగి ఖమ్మంకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో మోతె మండలం మామిళ్లగూడెం గ్రామంలోని మసీదు వద్దకు రాగానే బైక్‌కు వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మురళి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం టిప్పర్ డ్రైవర్‌ను మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకొన్నట్లు మోతె ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి భార్య, పాప, బాబు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సత్తయ్య మృతదేహం

మర్రిగూడ: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లిలో గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్‌ఐ కె. రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముక్కం సత్తయ్య(58) బుధవారం సాయంత్రం కల్లు గీసేందుకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. కాగా గురువారం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన చెట్ల పొదలో సత్తయ్య పడి ఉండటాన్ని అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సత్తయ్య కుటుంబ సభ్యులు వెంటనే అక్కడకు చేరుకొని అతడిని మర్రిగూడ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంఎస్ స్వామినాథన్ కృషి మరువలేనిది

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: భారతదేశ హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్. స్వామినాథన్ మృతి పట్ల శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. వ్యవసాయ రంగంలో ఎంఎస్ స్వామినాథన్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయన కృషితో ఆహార ఉత్పత్తి రంగంలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటని అన్నారు.


ప్రవక్త ఆచరణలను ఆదర్శంగా తీసుకోవాలి



రక్తదానం చేస్తున్న యువకులు

రామగిరి(నల్లగొండ): మహ్మద్ ప్రవక్త ఆచరణలను ముస్లింలు ఆదర్శంగా తీసుకోవాలని నల్లగొండ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి అన్నారు. నల్లగొడ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ వద్ద మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. 300కు ముస్లింలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మిలాద్ కమిటీ సెక్రటరీ సయ్యద్‌హబీబ్ ఉద్దీన్ ఆబిద్, జాఫర్, హాషం, సలీం, మసి, సయ్యద్ జమాల్ ఖాద్రీ, ఇమ్రాన్, హబీబ్ మహ్మద్, సయ్యద్ సుఫియాన్ ఖాద్రీ, ఉమెర్ పాల్గొన్నారు.

పిడుగుపడి రైతు మృతి



పెంటారెడ్డి మృతదేహం

రామన్నపేట: పిడుగుపాటుకు గురై రైతు మృతిచెందిన ఘటన గురువారం రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబబావి గూడెంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబబావిగూడేనికి చెందిన చింతల పెంటారెడ్డి(48) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం రోజు మాదిరిగానే పొలం పనులు చేయడానికి వ్యవసాయబావి వద్దకు వెళ్లాడు. బెండ తోటలో పనిచేస్తుండగా వర్షం మొదలయ్యింది. దీంతో పక్కనే పశువుల కొట్టం వద్దకు వెళ్లి మంచంపై కూర్చున్నాడు. ఆ సమీపంలో పిడుగు పడడంతో అతడి చాతి ఇతర శరీర భాగాలపై గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పరిసర ప్రాంత రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు నరేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

యాదాద్రీశుడి సేవలో జనగామ కలెక్టర్

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని జనగామ జిల్లా కలెక్టర్ సీహెచ్. శివలింగయ్య, కుటుంబ సభ్యులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ శివలింగయ్యకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



జనగామ కలెక్టర్ శివలింగయ్యకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

'టెట్'లో 9149 మంది అర్హత

- ఉమ్మడి జిల్లాలో పరీక్షకు 36,926 మంది హాజరు

నల్లగొండ: టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్)లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 36,926 మంది హాజరు కాగా 9149మంది అభ్యర్థులు అర్హత సాధించారు. కాగా నల్లగొండ జిల్లాలో 19,737 మంది పరీక్షకు హాజరుకాగా 485 మంది, అదే విధంగా సూర్యాపేట జిల్లాలో 12,248 మంది హాజరు కాగా 3,235 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 4,941 మంది హాజరు కాగా 1,059 మంది అర్హత సాధించారు.

పేపర్	పరీక్ష రాసిన అభ్యర్థులు	అర్హత సాధించిన వారు
పేపర్–1	18,061	6,347
పేపర్–2 (సోషల్)	8,810	1,032
పేపర్–2 (మ్యాథ్స్, సైన్స్)	10,055	1,770

చోరీకి వచ్చి పట్టుబడిన యువకులు

భూదాన్‌పోచంపల్లి: చోరీకి యత్నించిన ఇద్దరు యువకులను బాధితుడు పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. ఈ ఘటన గురువారం ఉదయం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామ పరిధిలోని జమ్మాళ్ల వద్ద చోటు చేసుకుంది. చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. అలీనగర్ గ్రామానికి చెందిన కడారి లింగస్వామి ఇంటి వద్ద ఆరుబయట నిలబడగా బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు లింగస్వామిని కత్తితో బెదిరించి అతని జేబులో ఉన్న రూ.1000తో పాటు సెల్‌ఫోన్ తీసుకొని బీబీనగర్ వైపు పారిపోయారు. వెంటనే అప్రమత్తమైన లింగస్వామి బీబీనగర్‌కు వెళ్లిన తన బావమరిది అయిన దోటి భాస్కర్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. దొంగలు అటువైపు వచ్చారని వారిని అడ్డగించాలని కోరగా భాస్కర్ కారులో జూలూరు వైపు వస్తుండగా రుద్రవెల్లి బ్రిడ్జి దాటిన తర్వాత ఎదురుగా వచ్చిన ఆ దుండగులను చూసి బైక్‌ను ఆపే ప్రయత్నం చేయగా వారు బైక్‌ను ఆపకుండా భాస్కర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో భాస్కర్ కిందపడటంతో తల, మోకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దుండగులు కూడా బైక్‌పై నుంచి కింద పడ్డారు. వీరి వెనకాలే వస్తున్న లింగస్వామి వెంటనే వారిని పట్టుకొని 100 నంబర్‌కు డయల్‌కు చేశాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

ఇద్దరూ విద్యార్థులే..

కాగా పట్టుబడిన ఇద్దరు యువకులు విద్యార్థులే కావడం గమనార్హం. వీరిలో సప్పావత్ గణేశ్(22) స్వస్థలం మహబూబాబాద్ జిల్లా మర్రిపెడ మండలం తానంపేట గ్రామం. ఇతను హైదరాబాద్‌లోని చైతన్యపురిలో అద్దెకు ఉంటూ డిగ్రీ సెకండియర్ చదువుతున్నారు. అయితే గణేశ్‌కు నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సూర్యాపేట జిల్లా చివ్వెంలలో ఇంటి డాబాపై పడుకొన్న మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు అపహరించిన కేసుతో పాటు ఉప్పల్‌లో బైక్ చోరీ చేసిన కేసులు అతడిపై ఉన్నాయి. కాగా మరొకరు మైనర్. అతనిది సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ అని తెలిసింది. వీరి కుటుంబం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి ఉంటున్నారు. ఇతను స్థానికంగా పదో తరగతి చదువుకుంటూ గణేశ్‌తో పాటు డీజే ఆపరేటర్ హెల్పర్‌గా వెళ్తుంటాడు.

చౌటుప్పల్‌లో సైతం రెండిళ్లలో చోరీ...

కాగా బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు బుధవారం రాత్రి చౌటుప్పల్‌లో సైతం రెండిళ్లలో 4 సెల్‌ఫోన్లు చోరీ చేశారు. అనంతరం బైక్‌పై జూలూరు వచ్చి తెల్ల వారుజామున చోరీ చేయడానికి వచ్చి పట్టుబడి కటకటాల పాలయ్యారు. బాధితుడు కడారి లింగస్వామి ఫిర్యాదు మేరకు గణేశ్, మైనర్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. కాగా గణేశ్‌ను కోర్టులో రిమాండ్ చేయగా, మైనర్‌ని జువైనల్ హోంకు తరలించారు.

కమ్యూనిస్టుల నాయకత్వంలోనే పేదోడికి న్యాయం

అడవిదేవులపల్లి: కమ్యూనిస్టుల నాయకత్వంలోనే పేదోడికి సరైన న్యాయం జరుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం అడవిదేవులపల్లి మండలంలోని చింతచెట్టుతండా, మొల్కచర్ల, చిట్యాల, ముదిమాణిక్యం తదితర గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన రెండు వందల మంది జూలకంటి సమక్షంలో సీపీఎంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవిదేవులపల్లి మండల పరిధిలో కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఆంధ్రా–తెలంగాణకు రాకపోకలు పెరిగి రెండు ప్రాంతాలు అన్నిరకాలుగా అభివృద్ధి చెందే అవకాశమున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అడవిదేవులపల్లి మండలం ఏర్పాటు విషయంలో సీపీఎం ప్రధాన భూమిక పోషించిందన్నారు. పేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకుంటే అర్హులైన వారికి కాకుండా అధికార పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఆర్థికసాయం అందుతుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంలో పాలక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, మండల కార్యదర్శి జటంగి సైదులు, నాయకులు సైదానాయక్, కోటిరెడ్డి, పాపానాయక్, కరీమున్నీసా, దయానంద్, జగన్, కోటి, శ్రవణ్, హన్మంతు, రంగా, రామానుజాచార్యులు, సర్వయ్య ఉన్నారు.



అడవిదేవులపల్లిలో సీపీఎం జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE

■ పాలకీడు మం॥ ఎం.వి.సింగారం లో సర్వే నెం. 144/1, ఎ॥ 2.13 గుంటల భూమి అమ్మబడును. ఫోన్ : 9030597318, 9951686244 [Y-1146224]

Services

TRAINING

■ గ్రామీణ మహిళలకు శుభవార్త. ఉచిత కుట్టు శిక్షణ 3 నెలల కాలవ్యవధి సంప్రదించండి. నార్కట్‌పల్లి. ఫోన్ : 7989377042 [H-788321]

Wanted

■ ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503 [G-1134]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్ గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-801113]

■ శ్రీ బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మిర్యాలగూడ నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్, జనరల్ స్టాఫ్, రిసెప్షనిస్టులు, ఫార్మాసిస్టులు, హౌజ్‌కీపింగ్, అంబులెన్స్ డ్రైవర్స్ మరియు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సంప్ర॥ సెల్: 9000947088, 6304363737 [Y-784221]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640468899/ 9640258899 [H-189336]

సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
9010178203
సూర్యాపేట : 9912220740
9010038110
9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి తదుపరి ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.